

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	67,558	67,558
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	5,400.42	5,647.81
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	51,540	37,671

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

12 రోజులు 240 మెట్రిక్‌టన్నులు

- ఇప్పుడిప్పుడే కేంద్రాలకు వస్తున్న ధాన్యం
- మరో వారం రోజుల్లో ఊపందుకునే అవకాశం
- 375 కేంద్రాలకు ఇప్పటికే 157 ప్రారంభం
- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లకు సన్నాహాలు
- వరి కోతలకు ఆటంకంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- పడిపోతున్న తేమ శాతంతో బేజారవుతున్నరైతులు



నల్లగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాక 12 రోజుల్లో 240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. ఈనెల మొదటి వారం నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నాన్‌ఆయకట్టు ప్రాంతంలో వరి కోతలు మొదలైన నేపథ్యంలో అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయకట్టు ప్రాంతంలో కొన్ని చోట్ల బోరుబావుల కింద నాట్లు వేసిన ప్రాంతంలో కూడా కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా నాన్‌ఆయకట్టు ప్రాంతంలోనే వరి కోతలు ప్రారంభమై ధాన్యం వస్తోంది. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వరి కోతలు ప్రారంభించేందుకు వెనుకంజ వేస్తున్నారు. హార్వెస్టర్ల ద్వారా వరి నూర్పిడిచేసి వెనువెంటనే మార్కెట్‌కు తరలిస్తున్నారు. పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో ఐకేపీ కేంద్రాల్లో రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. అయితే తేమశాతం అధికంగా ఉండటంతో సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయని పరిస్థితి ఉంది. జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలకు 157 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మరో 25 కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంతాల్లో ధాన్యం రాకను బట్టి ప్రారంభించనున్నారు.

వచ్చే వారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. రైతులు వీలైనంత మేరకు ధాన్యాన్ని ఆరబెట్టుకొని రావాలని సూచిస్తున్నారు. హార్వెస్టర్ల ద్వారా కోతలు పూర్తిచేసిన వెంటనే పచ్చి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా రైతులు కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో పాటు వర్షాలకు కూడా ధాన్యం తడుస్తోంది. అయితే ఈ ధాన్యాన్ని ఆరబెడితేనే కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు ఎగుమతి చేసేందుకు ప్రధానంగా లారీల సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలకు ధాన్యం బస్తాలు ఎత్తడంతో పాటు మిల్లుల వద్ద అన్‌లోడ్ చేసేందుకు హమాలీల సమస్య లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచతున్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంది. 375 కొనుగోలు కేంద్రాలు మొత్తంగా ప్రారంభమైనప్పుడు అవసరమైన సామగ్రితో పాటు హమాలీలు కూడా అందుబాటులో ఉంటే కొనుగోళ్లలో ఎలాంటి సమస్యరాదని యంత్రాంగం భావిస్తోంది. దీనికి తోడు నిరంతరం కేంద్రాల్లో అధికారులు కొనుగోళ్లను పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.



6.30లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు లక్ష్యం

జిల్లాలో 6,30,981 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. అందులో దొడ్డురకం 4,65,657 మెట్రిక్‌టన్నులు, సన్నరకం 1,65,324 మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయనున్నారు. సన్నరకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 వరకు బోనస్ ఇస్తోంది. అదేవిధంగా నాణ్యత ప్రమాణాల విషయంలో మండల స్థాయిలో ఐకేపీ కేంద్రాలకు సంబంధించి ఏపీవోలను పర్యవేక్షణ కోసం నియమించారు. హార్వెస్టర్ల వివరాలను, రవాణా సౌకర్యాల గురించి ఎప్పటికప్పుడు వీరు వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం 157 కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తున్న ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేసేందుకు 40లారీలను ఏర్పాటు చేశారు. ఈ వానాకాలంలో పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉండటంతో

మిగతా 10వ పేజీలో...

భారీ వర్షాలతో

బత్తాయి డీలా



పూత పిందె లేని బత్తాయి చెట్లు

- చెట్లు వాడుపడక.. కత్తెర కాపు లేక.. తెగుళ్లతో దెబ్బతింటున్న తోటలు
- ఈ ఏడాది అంతా నిరాశే
- ఆందోళనలో రైతులు

మిర్యాలగూడ వ్యవసాయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకు కల్పతరవుగా ఉన్న బత్తాయిని వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు బత్తాయి కాయకు ధర లేక భారీగా నష్టపోయిన రైతులు ఈ సారైనా కాలం కలిసొస్తుందని ఆశపడ్డా ఎడతెరిపిలేని వర్షాలు నిరాశను మిగిల్చాయి. తెగుళ్లవ్యాప్తి, కత్తెర కాపు అనుకూల వాతావరణం లేక రైతులు దిగాలు చెందుతున్నారు.

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతోందని అంచనా. ఈ ఏడాది అధిక వర్షాలకుతోడు భూగర్భ జలాలు పెరగడంతో చాలా తోటలు జాలు పట్టాయి. సాధారణంగా భూమిలో అధిక తేమ ఉంటే బత్తాయి చెట్లు దెబ్బతింటాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు నేల తడి ఆరకపోవడంతో బత్తాయికి ముప్పు ఏర్పడింది.

కత్తెర కాయ లేదు

బత్తాయిలో ప్రధాన ఆదాయ వనరు కత్తెర కాయ ఏప్రిల్, మే నెలలో కోతకు వస్తుంది. ఈ కాయ రావాలంటే ఆగస్టు వరకు సీజన్ కాయ కోతలు పూర్తిచేసి ఎండు కొమ్మలు కత్తిరించుకున్న తరువాత సెప్టెంబరు-అక్టోబరు నెలలో చెట్టును వాడుకు (బహర్ పద్ధతి) వదలిపెట్టాలి. చెట్టు వాడిపోయిన దశలో పిండి వేసుకుని నీరు కట్టడంతో ఒక్క సారిగా పూత వస్తుంది. పిందె వచ్చాక వేసవిలో కాయ కోతకు వస్తుంది. ఈ సారి నేటికీ

మిగతా 10వ పేజీలో...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ



'ఓట్ చోరీ'పై సంతకాల సేకరణ పత్రాలను చూపుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో బీజేపీ దొంగ ఓట్లతో గద్దెనెక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగానికి వచ్చిన ఆపదను కాపాడేందుకు రాహుల్‌గాంధీ నాయకత్వంలో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రతీ పోలింగ్ బూత్‌లో సంతకాల సేకరణకు పార్టీ ఆదేశించిందన్నారు. ఓట్ చోరీ పట్టణాల్లో ఎక్కువ ఉంటోందని, అందుకే ఉత్తరాది రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ ఒత్తిడికిగురై ఎలక్షన్ కమిషన్ కూడా పట్టించుకోకుండా ఈ చోరీలో భాగస్వామ్యమైందన్నారు. నిజాయితీగా ఏ ప్రభుత్వం పనిచేస్తుందో ఆ ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ తనవశం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. బీహార్‌లో 70 లక్షల ఓట్ చోరీ చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, నూక కిరణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నర్సింహ, తాళ్లూరి మురళీ, చింత ధనుంజయ్, షేక్ ఇంతియాజ్, బొల్లికొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ నిబంధనలు పాటించాలి

డీటీవో లావణ్య



స్కూల్ బస్సులను తనిఖీచేస్తున్న డీటీవో లావణ్య, ఎంవీఐలు

మిర్యాలగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహన యజమానులు రవాణాశాఖ నిబంధనలను తప్పక పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి లావణ్య అన్నారు. బుధవారం పట్టణంలోని పలు స్కూల్ బస్సులను ఎంవీఐ చంద్రశేఖర్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. తనిఖీల్లో స్కూల్ బస్సుల్లో అటెండర్లు లేకపోవడం, ఓవర్‌లోడ్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు లేని తొమ్మిది బస్సులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ బస్సుకు ప్రాక్సీ మిటీ మిర్రర్ ఏర్పాటు చేయాలని అన్నారు. అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలని ఆదేశించారు. వాహన తనిఖీల్లో ఎంవీఐలు సోనిప్రియ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు చట్టం చేయాలి

నల్లగొండ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటులో చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం స్థానిక సుభాష్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసేందుకు కృషి చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేరుతో పార్లమెంట్‌లో చట్టం చేయకుండా బీసీల జీవితాలను నాశనం చేసే చర్యలకు పాల్పడతోందన్నారు. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదనే నిబంధన, కోర్టుల పేరుతో బీసీల ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తున్నారని అన్నారు. రాజకీయాలకతీతంగా సామాజిక న్యాయం కోసం సాగుతున్న పోరులో అంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. గీత పనివాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ, ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కేస్.రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, బరిగల వెంకటేష్, సుజాత, విజయ, మాధవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుబడిలో రాష్ట్రం రికార్డ్

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం దిగుబడిలో రాష్ట్రం ఆల్‌టైం రికార్డ్ సాధించిందని, వానాకాలం 148.3లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వానాకాలంలో పెద్ద మొత్తంలో ధాన్యం వస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాలని, రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిరీక్షించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని, ఈ విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, రెండేళ్లుగా ధాన్యం సేకరణను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో సైతం సేకరణను అలాగే పూర్తిచేయాలని ఆదేశించారు. ధాన్యంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా పంటల సేకరణ పై కూడా దృష్టి సారించాలన్నారు.



అన్ని వసతులు కల్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాలకు అవసరమైన సామగ్రిని పంపామని, మరో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ధాన్యం రవాణాకు లారీల సమస్య, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమను కొలిచే, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను మండల స్థాయిలో ఏపీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. హార్వెస్టర్ల వివరాలను సైతం సేకరించాలని ట్రాన్స్‌పోర్ట్, పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపేందుకు తొలి విడత 40 లారీలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్‌వో వెంకటేశం, డీఎం గోపికృష్ణ, వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తదితరులు

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం

ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బిశ్వంత్ రాజా మహతి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పాలనవైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులను పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎంతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి సిరాజ్‌ఖాన్, మార్కెట్‌కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, లోకసాని శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, రాంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మెపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రుక్మారెడ్డి, బిక్కునాయక్, పాల్గొన్నారు.

నేడు ఏఐసీసీ పరిశీలకుల రాక

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా ఏఐసీసీ పరిశీలకులు మిర్యాలగూడకు రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం 9గంటలకు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎంసీపీఐ నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సామాజిక విక్ష, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని ఎంసీపీఐ కేంద్రకమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాస్తారోకో నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజురోజుకూ ఫాసిస్ట్ విధానాలను అమలు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సుప్రీం కోర్టు సిజే గవాయ్‌పై చెప్పుతో దాడి, హర్యాణాలో దళిత ఐపీఎస్ అధికారిపై సామాజిక వివక్ష కొనసాగించడం వల్ల ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఒడిశాలో దళిత మహిళ సజీవ దహనం, విలేజ్ అభివృద్ధి కమిటీ పేరుతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సామాజిక బహిష్కరణలు, దాడులు, పరువు హత్యల పరంపర సాగుతోందని అన్నారు. ఈ సంస్కృతి ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెంచి పోషిస్తోందని అన్నారు. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా అణగారినవర్గాలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశీ, కిరణ్, భరత్, జ్యోతి, కమలమ్మ, లాలు, మచ్చ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కేతేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో ధాన్యం తడిసిన రైలకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో తడిసిన వానికిలం ధాన్య రాసులను ప్రమీల పలువురు రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన రైతుల ధాన్యాన్నంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఆరబోసిన ధాన్యం వరదలకు కొట్టుకుపోయి, నష్టాలబారిన పడిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, కోట లింగయ్య, చెరుకు సత్తయ్య, సీహెచ్.నాగయ్య, కె.శోభన్, వి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడాలి



దేవరకొండ ఉన్నతపాఠశాలలో మాట్లాడుతున్న జీటీఏ జిల్లా అధ్యక్షుడు స్వామి

నల్లగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కులు, పదోన్నతుల కోసం పోరాడాలని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) జిల్లా అధ్యక్షుడు దూడిగామ స్వామి అన్నారు. బుధవారం మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరాడుతున్న జీటీఏను ఆదరించాలని అన్నారు. అందుకు విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టినట్టు తెలిపారు. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా సభ్యత్వ నమోదు చేస్తుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమాల్లో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంపత్‌కుమార్, ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మానాయక్, ప్రధానోపాధ్యాయుడు శేషు, యేషబోయిన బద్రీనాథ్‌యాదవ్, పత్తేపురం సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు వెళ్లి కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు



పృథ్వీరాజ్ ఆచూకీ కోసం గాలిస్తున్న గజ ఈతగాడు

నేరేడుగొమ్ము, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండల పరిధిలోని కృష్ణానదిలో విహారయాత్రకు వచ్చిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన పృధ్వీరాజ్(30) ఈ నెల 14న విహారయాత్రకు నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీకి వచ్చాడు. పడవ ఎక్కి స్నేహితులతో కలిసి కృష్ణానదిలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కృష్ణానీటిలో పడిపోయాడు. కాగా స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ బీసన్న, ఎస్ఐ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. 30 మంది గజ ఈతగాళ్లతో 17 బృందాలుగా ఏర్పాటు చేసి కృష్ణానదిలో పృధ్వీరాజ్ ఆచూకీ కోసం గాలింపుచర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగకు జైలుశిక్ష

నిడమనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సమయాల్లో బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన ఓ వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ.స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైజన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన గుయ్యం శంకర్, తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగంపల్లి సత్యనారాయణ, అనుముల మండలం చిన్నఅనుములకు చెందిన గోర్ల సైదయ్య, పెద్దవూర మండలం బాసినబావికి చెందిన కూన్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ద్విచక్ర వాహనాలను హాలియా బస్టాండ్‌లో వేర్వేరు సమయాల్లో పార్కింగ్ చేయగా చోరీకి గురయ్యాయి. బాధితులు తమ వాహనాలు దొంగతనం జరిగిన రోజే హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. అనుముల మండలం ఇబ్రాహీంపేట శివారు అలీనగర్ చెక్‌పోస్టుకు చెందిన మహమ్మద్ జాని నాలుగు ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ సాయిప్రశాంత్ నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా బుధవారం కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడు జానికి నాలుగు కేసుల్లో 14 నెలల 10 రోజులు జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ సంజీవ్‌కుమార్ కేసు విచారణకు సహకరించారని లైజన్ అధికారి తెలిపారు.

అలిగి ఇంటి నుంచి చెర్వుగట్టుకు వచ్చిన బాలిక

● బాలికను క్షేమంగా తండ్రికి అప్పగించిన దేవస్థాన సిబ్బంది

నార్కట్‌పల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లమన్నందుకు అలిగి ఇంట్లో చెప్పకుండా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవస్థానానికి వచ్చిన బాలికను ఆలయ సిబ్బంది క్షేమంగా తండ్రికి అప్పగించారు. కుమార్తె కోసం వెతుకుతుండగా ఎట్టకేలకు దొరకడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన బాలిక(13) ఇదే మండలంలోని జనంపల్లి గురుకుల బాలిక పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటి వచ్చిన బాలిక తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఈ ఏడాది వరకు వెళ్లు అని చెప్పి తల్లిదండ్రులు కోపగించుకున్నారు. మంగళవారం ఉదయం తండ్రి తను పనిచేసే చోటికి వెళ్లాడు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే తల్లి కూడా విధులకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి చేరిన తల్లికి కుమార్తె ఇంట్లో కన్పించకపోయే సరికి చుట్టుపక్కల వాకబు చేయగా ఉదయాన్నే బయటకు వెళ్లిందని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు తన కుమార్తె ఫొటోను పలువురు బంధువులకు షేర్ చేయగా బాలిక ఫొటో వివరాలతో కూడిన సమాచారాన్ని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం సిబ్బంది చూశారు. చెర్వుగట్టుకు వచ్చిన బాలిక కోనేరులో స్నానం చేసి స్వామి దర్శనానికి సిద్ధమవుతుండగా సీసీ ఫుటేజీ ఆధారంగా సిబ్బంది గుర్తుపట్టారు. వెంటనే ఈవో కార్యాలయానికి తీసుకువచ్చి తండ్రికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి తన కుమార్తెను తీసుకెళ్లాడు. కాగా తన కుమార్తెను క్షేమంగా అప్పగించిన దేవస్థానం సిబ్బందికి బాలిక తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళపై దాడి చేసి పుస్తెలతాడు అపహరణ



గుర్తుతెలియని వ్యక్తి చేసిన దాడిలో గాయపడిన సావిత్రమ్మ

శాలిగౌరారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై వెళ్తున్న మహిళపై ఇనుప రాడ్డుతో దాడి చేసి ఐదు తులాల పుస్తెలతాడు చోరీ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మకు శాలిగౌరారం మండలం మాదారం గ్రామశివారులో 15 గుంటల వ్యవసాయ భూమి ఉంది. సావిత్రమ్మ ఓగోడు నుంచి పొలం వద్దకు బుధవారం నడుచుకుంటు వస్తోంది. హెల్మెంట్ ధరించి స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని సావిత్రమ్మను ఎక్కడికి వెళ్తున్నావు పెద్దమ్మ అని మాట్లాడాడు. పొలం వద్దకు వెళ్తున్నాని చెప్పడంతో తాను అక్కడికే వెళ్తున్నానని స్కూటీ ఎక్కమని అనడంతో నమ్మి ఎక్కింది. చౌవుళ్లగూడెం సమీపంలోకి రాగానే మూత్ర విసర్జన వస్తుందని స్కూటీని ఆపాడు. వెంటనే సావిత్రమ్మ నడుచుకుంటూ కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. దాడి చేసే సమయం లో తలపై ఆమె చేతులు పెట్టుకోగా చేతులపై కొట్టడంతో ఎడమ చేతి రెండు వేళ్ల విరిగి బలమైన గాయాలయ్యాయి. అనంతరం సావిత్రమ్మ మెడలోని ఐదు తులాల పుస్తెలతాడు లాక్కొని స్కూటీపై పారిపోయాడు. వెంటనే ఆమె కుమారుడు సైదులుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పడంతో అతను సంఘటనా స్థలానికి చేరుకొని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



కట్కూరి లక్ష్మయ్య

అడ్డగూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : యాద్రాదిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జానకీపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మయ్య ఈ నెల 14న మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకువెళ్లి తిరిగి రాలేదు. లక్ష్మయ్యకు మతిస్థిమితం సరిగాలేదని లక్ష్మయ్య కుమారుడు సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లేప్పుడు లక్ష్మయ్య ఆకుపచ్చ బెడ్‌షీట్, తెల్లరంగు బనియన్, తెల్లరంగు ధోతి ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. లక్ష్మయ్య ఆచూకీ తెలిసిన వారు 7989500744 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



సూర్యాపేట క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో గుర్తుతెలియన వ్యక్తి వైద్యచికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3వ తేదీన జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్స అందించారు. ఈ నెల 11వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహం సూర్యాపేట మార్చురీలో ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు సూర్యాపేట పట్టణ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

తేమ తగ్గదు.. తూకం వేయరు

● ఐకేపీ సెంటర్‌లలో రైతులకు తప్పని తిప్పలు ● 15 రోజులైనా కాంటాలకు నోచలే



మాడ్గులపల్లి ఐకేపీలో కాంటాలు కాని ధాన్యం రాశులు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

మేఘావృతమైన ఆకాశం ఓవైపు, ఆరని ధాన్యం మరో వైపు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పెరిగిన రసాయన ఎరువుల ధరలు, వర్షాలు, చీడపీడల బెడద లాంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కంటి రెప్పలా కాపాడిన పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెస్తే 15 రోజుల నుంచి కాంటాలకు నోచుకోలేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ బోనస్ పథకంతో ఈసారి 15శాతం మేర ఐకేపీ కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మబ్బులతో నిండిన ఆకాశం ఎండవేడిమిని కలిగించకపోవడంతో ధాన్యం ఆరక ధాన్యం కాంటాలు కాక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఒకటి రెండు చోట్ల ధాన్యం ఆరబెట్టే యంత్రాలను ఏర్పాటుచేయగా మిగతా కేంద్రాల్లో యంత్రాల ఏర్పాటుకు సన్నాహలు చేయకపోవడంతో ప్రతికూల వాతావరణంతో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తల్లడిల్లుతున్నారు.

23 కేంద్రాల్లో కొనుగోలుకు ఏర్పాట్లు

నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గంలో 23ఐకేపీ కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నాహలు చేస్తున్నారు. దామరచర్ల మండలంలో 5, అడవిదేవులపల్లి 1, వేములపల్లి 3, మిర్యాలగూడ 4 మాడ్గులపల్లిలో 10ఐకేపి కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే మాడ్గులపల్లి మండలంలో మాడ్గులపల్లిలో 1, గారకుంటపాలెంలో దొడ్డు, సన్నరకాలకు సంబంధించి 2 కేంద్రాలను ప్రారంభించగా రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి రాశులుపోశారు. మిర్యాలగూడ మండలం అవంతిపురం వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ ఇంకా రైతులు ధాన్యం తీసుకరాలేదు.

తేమ తగ్గితేనే కాంటాలు

ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి 2,369గా మద్దతు ధర ప్రకటించి ఐకేపీ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలుచేస్తోంది.కాగా 17శాతం తేమ తగ్గితేనే ధాన్యాన్ని కాంటాలు వేస్తుండటంతో మబ్బులతో నిండిన ఉంటున్న ఆకాశం అప్పుడప్పుడు చినుకులు రాలుస్తుడటంతో ధాన్యం ఆరబెట్టడం రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మాడ్గులపల్లి సెంటర్‌కు రైతులు 2,500 బస్తాల ధాన్యం తీసుకురాగా 15 రోజుల నుంచి ధానాన్ని కాంటాలు వేయలేదు.

15 శాతానికి పెరిగే అవకాశం

ప్రభుత్వం ఐకేపీల ద్వారా కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తుడటంతో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా సన్న ధాన్యాన్ని తీసుకవచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత సీజన్‌లో 5శాతం రైతులు మాత్రమే సన్నధాన్యం తీసుకరాగా ప్రస్తుత సీజన్‌లో 15 శాతానికి పెరిగే అవకాశం ఉంద ంటున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 1,16,000ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా సుమారు 20వేల ఎకరాల ధాన్యం ఐకేపీలకు తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని తేవాలి



ఐకేపీ కేంద్రాల్లో ఆరబెట్టుకునేందుకు సరిపడ స్థలం ఉండదు. రైతులు పొలాల వద్దే ఆరబెట్టే ప్రయత్నంచేయాలి. 17 శాతం తేమ తగ్గితేనే వెంటనే కాంటాలు వేస్తారు. ఇబ్బందులు తప్పుతాయి. నిబంధనల ప్రకారం రైతులు ధాన్యం తెచ్చి సహకరించాలి.

సైదానాయక్, ఇన్‌చార్జి ఏడీఏ మిర్యాలగూడ

15 రోజుల నుంచి ఐకేపీలోనే



నాకున్న ఎనిమిది ఎకరాల్లో 1010 రకం వరి సాగు చేశా. 400 బస్తాల ధాన్యం ఐకేపీకి తెచ్చా. మబ్బులతో ధాన్యం ఆరలేదు. కాంటాలు కావడంలేదు. తేమ రావడం లేదని కాంటాలు వేయడంలేదు. ఆకాశం మబ్బు పట్టి ఉంటోంది. గట్టిగా వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందని భయం వేస్తోంది. రోజు ధాన్యం ఆరబోయడం రాశిపోయడం చేస్తున్నాం. అధికారులు త్వరగా కాంటాలు వేసేలా చూడాలి.

కట్టా సత్తిరెడ్డి, రైతు మర్రిగూడెం

ఆరబెట్టే యంత్రాలు ఏర్పాటుచేయాలి



వానాకాలంలో తేమ వచ్చేదాకా ధాన్యం ఎండ బె ట్టా లంటే కష్టం.ఆరబెట్టే కూలీలకు అధిక డబ్బు చెల్లించాల్సి వస్తోంది. తేమ శాతం ఎక్కువగా ఉంటే ఐకేపీలో కొనడంలేదు. బయట వ్యాపారులు తక్కువకు కొంటున్నారు. వానల భయం వెంటాడుతోంది. 10 రోజులుగా ఐకేపిలో రాశుల వద్దే కాపాలా ఉంటున్నా. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టే యంత్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

ముద్దారపు విజయలక్ష్మి, మహిళా రైతు, దాచారం గ్రామం

శ్రీగంధం చెట్లను చోరీచేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాం రెడ్డి

నల్లగొండ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండునెలలుగా నల్లగొండ జిల్లాతో పాటు సికింద్రాబాద్ పరిసరాల్లో రైతులు పెంచుకున్న శ్రీగంధం చెట్లను నరికి షాగను విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు నిందితులు పరారయ్యారు. బుధవారం రాత్రి డీఎస్పీ కే.శివరాంరెడ్డి విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సెప్టెంబరు 30వ తేదీన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో రైతు విద్యాసాగర్‌రెడ్డికి చెందిన తోటలోని 10 శ్రీగంధం చెట్ల షాగలను దొంగతనం చేయడంతో పాటు మరో 5 శ్రీగంధం చెట్లను నరికి వదిలివేశారు. ఈ ఘటనపై విద్యాసాగర్‌రెడ్డి కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు నాలుగు బృందాలుగా ఏర్పడి బుధవారం నల్లగొండ-దేవరకొండ రహదారిపై రంగారెడ్డి బంగ్లా వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా దేవరకొండ వైపు నుంచి నల్లగొండకు రెండు ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించగా వెంబడించి తనిఖీ చేశారు. వారి వద్ద మూడు రంపాలు, మూడు గొడ్డళ్లు, ఫెన్సింగ్ వైర్ కట్ చేసే ఒక కట్టర్, ఒక యాక్సల్ బ్లేడ్, మూడు మొబైల్ ఫోన్లను, రెండు బైకులను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకొని విచారించారు.

రుద్రాక్షలు, పూసలు విక్రయిస్తూ ఆపై దొంగతనాలు

శ్రీగంధం చెట్లను మొత్తం ఆరుగురు అంతర్రాష్ట్ర నిందితులు అక్రమంగా నరికి దొంగతనం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన అన్నాబౌ లక్ష్మణ్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జవాస్, అదే రాష్ట్రానికి చెందిన అజువా పరారీలో ఉండగా మధ్యప్రదేశ్‌కు చెందిన దివానా, దద్దసింగ్, మజాన్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు దేశంలోని వివిధ ప్రాంతాలల్లో సంచార జీవితాన్ని గడుపుతూ రుద్రాక్షలు, పూసలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఎక్కడికి వెళ్లినా గ్రామశివారులో గుడారాలు వేసుకొని నివసిస్తూ ఉంటారు. రెండునెలల కిందట మహారాష్ట్రకు చెందిన అన్నాబౌ లక్ష్మణ్ గైక్వాడ్ మిగతా ఐదుగురికి పరిచమయ్యాడు. వీరంతా హైదరాబాద్‌లో ఉన్నప్పుడు లక్ష్మణ్ గైక్వాడ్ వీరి గుడిసెల వద్దకు వచ్చేవాడు. రుద్రాక్షలు విక్రయించి ఎన్నాళ్లయినా ధనవంతులు కాలేరని, తాను చెప్పినట్లుగా చేస్తే అధికంగా డబ్బు సంపాదించవచ్చని రెచ్చగొట్టేసేవాడు. తెలంగాణలో రైతులు గంధం చెట్లను అధికంగా సాగు చేస్తుంటారని, ఆ గంధం కర్రలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున వాటిని నరికి విక్రయిస్తే వచ్చిన డబ్బులో వాటా ఇస్తానని ఒప్పించాడు. దీంతో వారంతా కలిసి శ్రీగంధం చెట్లను నరికి దొంగతనాలు చేసే వారన్నారు. అధిక డబ్బు సంపాదించాలనే దురాశతో దొంగతనాలకు ఒప్పుకొని కనగల్ మండలంలోని తేలకంటిగూడెం, తిమ్మన్నగూడెం, నార్కట్‌పల్లి, గుర్రంపోడు, నల్లగొండ రూరల్, చండూరు మండలాల్లో మొత్తం ఆరు దొంగతనాలు చేశారన్నారు. వివిధ ప్రాంతాలల్లో 166శ్రీగంధం చెట్లను నరికారని దీంతో రూ.1.66 కోట్ల విలువైన ఆర్థికనష్టం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కేసును త్వరితగతిన ఛేదించిన చండూరు సీఐ కే.ఆదిరెడ్డి, ఎస్ఐలు కే.రాజీవ్‌రెడ్డి, ఎన్.వెంకన్న, బీ.సైదాబాబులతో పాటు రైటర్ రమేష్, జానకిరాములు, తిరుమలేష్, శ్రీకాంత్, రాజు, బాలకోటి, శంకర్, శేఖర్, సురేష్, రమేష్, వెంకట్‌రెడ్డిలను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

జార్ఖండ్‌లో గరిడేపల్లి మండల వాసి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

గరిడేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రంలో రైలు నుంచి జారిపడి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారి గూడెం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కీత వెంకటేశ్వర్లు(52) వ్యక్తిగత పనుల నిమిత్తం ఢిల్లీకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న జార్ఖండ్ రాష్ట్రం కరోడా ప్రాంతంలో ప్రమాదవశాత్తు రైలునుంచి జారి పడి మృతి చెందాడు. అతడి జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా అక్కడి రైల్వే పోలీసులు సమాచారం అందించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కరోడా ప్రాంతానికి కుటుంబ సభ్యులు బయలుదేరారు. ఇదిలా ఉండగా తెలంగాణ ఉద్యమంలో వెంకటేశ్వర్లు చురుగ్గా పాల్గొనేవాడని, తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసిన సమయంలో తనదైన శైలిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు మృతికి బీఆర్ఎస్ మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

తుంగతుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో అలుగులో ట్రాక్టర్ బోల్తా పడి రేషన్ బియ్యం తడిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంగెం గ్రామం నుంచి వెంకపల్లి గ్రామానికి బుధవారం హమాలీలు 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ట్రాక్టర్లలో డీలర్ దుకాణానికి తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల భారీవర్షాలకు సంగెం-వెంకేపల్లి గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారి నుంచి అలుగు పోతుండటంతో రోడ్డు దెబ్బతింది. ఆ దారి గుండా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. హమాలీలకు, డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. రేషన్ బియ్యం బస్తాలు నీటిలో పడటంతో తడిశాయి. రెండు గ్రామాల మధ్యలో బ్రిడ్జి నిర్మించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని చుట్టుపక్కల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

జూదరుల అరెస్టు

పాలకవీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో బుధవారం ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కోటేష్ తెలిపారు. జాన్‌పహాడ్, రావిపహాడ్ గ్రామాలకు చెందిన ఐదుగురు జాన్‌పహాడ్ దర్గా పరిధిలో చింతగింజలతో డిజ్జీ ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద రూ.2వేల నగదు, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. జూదం నేరమని ఎస్ఐ అన్నారు.

సులభ సంపాదన కోసం దొంగతనాలు



ద్విచక్రవాహనాల దొంగలను మీడియాకు చూపుతున్న సీఐ రమేష్, ఎస్ఐ లక్ష్మీనారాయణ

భువనగిరి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సులభ సంపాదన లక్ష్యంగా ద్విచక్రవాహనాలను చోరీచేస్తున్న హైదరాబాద్ పాతబస్తీకి చెందిన దొంగల ముఠాను యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్ర పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ యాకత్‌పురాకు చెందిన సయ్యద్‌తాలిబ్ అలీ సైన్‌బోర్డులు చేస్తూ జీవనం గడిపేవాడు. మద్యం, గంజాయి, పబ్బులకు అలవాటై సులభ సంపాదన కోసం ద్విచక్రవాహనాల చోరీని ప్రారంభించాడు.2020-24 మధ్య హైదరాబాద్‌లోని పలుప్రాంతాల్లో చోరీలు చేసి జైలుకు వెళ్లాడు. అయితే జైలు నుంచి ఆగస్టులో విడుదలైన నిందితుడు సైదాబాద్‌కు చెందిన అల్లుబా, యాకత్‌పురాకు చెందిన రెహన్, పహాడికి చెందిన ఎండీ సాజిద్, వికారాబాద్ జిల్లా చిన్‌గోముల్ చెందిన మహ్మద్ సోహబ్‌తో ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాల చోరీలను ముమ్మరం చేశారు. చోరీ చేసిన ద్విచక్రవాహనాలను సోహబ్‌కు అందిస్తే అతను విక్రయించేవాడు. వచ్చిన సొమ్మును ఐదుగురు పంచుకునేవారు. ఈ క్రమంలో ఈ ముఠా భువనగిరిలో ఇటీవలే ఐదు బైకులను చోరీ చేసింది. ఈమేరకు వచ్చిన ఫిర్యాదులతో పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మంగళవారం రాత్రి భువనగిరి పెద్దచెరువు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తాలిబ్‌అలీ, సాదిక్‌అలీనీ అదుపులోకి తీసుకొని విచారించడంతో చోరీ ఉదంతం వెలుగుచూసింది. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి పలు ప్రాంతాల్లో దాడులు చేసి రూ.4.48 లక్షల విలువైన ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరితో పాటు సోహబ్‌ను అరెస్ట్ చేశారు. మిగతా ఇద్దరూ పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముగ్గురిని స్వాధీనం చేసుకున్న బైకులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాపై హైదరాబాద్‌లోని పలు స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసును ఛేదించడంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ, క్రైమ్ సిబ్బంది ఎన్ రమేష్, కొండారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



కమిలిన విద్యార్థి చేయి

భువనగిరి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో అల్లరి చేస్తున్న 5వ తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. మంగళవారం తరగతి గదిలో అల్లరి చేస్తున్న విద్యార్థిని నియంత్రించే క్రమంలో కర్రతో ఉపాధ్యాయుడు కొట్టాడు. దీంతో విద్యార్థి వంటిపై గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో వాగ్వాదం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీతో వివాదం సద్దుమణిగింది.

లైంగిక వేధింపుల కేసులో కారు డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కారు డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం తీర్పునిచ్చింది. నల్లగొండ రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అత్యాచార, పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి ఎన్.రోజారమణి బుధవారం తీర్పును ప్రకటించారు. కేసు వివరాల్లోకి వెళితే... సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉప్పుల నాగార్జున (35) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2019 ఏప్రిల్ నెలలో కేతేపల్లి మండలంలోని ఓ గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు నాగార్జున హాజరయ్యాడు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. అక్కడ ఒంటరిగా ఉన్న బాలికపై లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆమెపై బలవంతంగా అత్యాచారం చేయాలని ప్రయత్నించాడు. అతని దురుద్దేశ్యాన్ని గ్రహించిన బాలిక అతడిని తోసేసి బయటకు పరుగెత్తింది. దీంతో నాగార్జున పరారయ్యాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు పోక్సోచట్టం, పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరిపి నేరాన్ని కోర్టులో నిరూపించారు. నేరం నిరూపణ కావడంతో పోక్సోచట్టం-2012 సెక్షన్ 10కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. అదేవిధంగా బాలిక ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన నేరానికి ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా, బాలికను లైంగికంగా వేధించిన నేరం నిరూపణ అయినందుకు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ మూడు శిక్షలూ ఏకకాలంలో అమలుచేయాలని కోర్టు ఆదేశించడంతో నిందితుడు ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉండగా, రూ.20వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. జరిమానా రూ.20వేలతో పాటు బాధితురాలికి ఉపశమనం, పునరావాస నిమిత్తం జిల్లా న్యాయ సేవాసహకార సంస్థ నుంచి రూ.7లక్షల పరిహారం అందించాలని జడ్జి ఆదేశించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. నిందితుడికి శిక్షపడేలా సరైన ఆధారాలను సేకరించి కోర్టులో సమర్పించిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు కేతేపల్లి ఎస్ఐలు రాంబాబు, రామకృష్ణ,ప్రస్తుత ఎస్ఐ సతీష్, సీఐ కొండల్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, భరోసాలీగల్ సెల్ అధికారి కల్పన, సీడీవో కిరణ్‌కుమార్, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

వృద్ధుల సంక్షేమానికి న్యాయసేవాధికార సంస్థ కృషి



భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో అప్పిలేట్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మాధవీలత

భువనగిరి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వయో వృద్ధుల సంక్షేమానికి న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తోందని యాదాద్రిభువనగిరి సంస్థ కార్యదర్శి మాధవీలత అన్నారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో అప్పిలేట్ ట్రిబ్యునల్ లీగల్ సర్వీసెస్ విభాగాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. వయోవృద్ధులకు న్యాయ సేవలను, న్యాయపరమైన సలహాలను, న్యాయసహాయ న్యాయవాది ద్వారా అందజేస్తారని, ఈ సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జీ నాగరాజు, పారా లీగల్ వాలంటీరు పూనగల్ల మల్లేశ్, ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పీవీ హరికిషన్‌రావు, సజ్జత్, నవీన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి చదువులపై దృష్టి పెట్టాలి

సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి చదువులపై దృష్టి పెట్టాలని యాదాద్రిభువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి కే సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. భువనగిరి మండలంలోని అనాజీపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి సౌత్ ఇండియా సైన్స్ డ్రామా కాంపిటీషన్-2025 పోటీలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 9 పాఠశాలల నుంచి సుమారు 100 మంది పాల్గొన్నారు. విజేతలకు బుధవారం బహుమతులను అందజేసి, డీఈవో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పీ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు రంగ రాజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


వివేకవర్ధన్

హుజూర్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందపురానికి చెందిన దేవిశెట్టి వివేకవర్ధన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వరకు హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడు. ఈ నెల 14 భువనగిరిలో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన వివేకవర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గుంటిపల్లి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న దేవిశెట్టి రవికుమార్ కుమారుడైన వివేకవర్ధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


జక్కి శ్రీకర్

తుంగతుర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జక్కి శ్రీకర్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికయ్యాడు. మండల, జిల్లా స్థాయిలో రాణించాడు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ యాకయ్య తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి, నాగారం అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు రిషివర్ధన్, తరుణ్ ఇటీవల హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి గణేష్, వైస్ ప్రిన్సిపాల్ వినీల్, వార్డెన్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్ష విద్యార్థుల ప్రతిభ


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హాలియా: సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్‌లో 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా ప్రథమస్థానం సాధించగా జిల్లా తరుపున హాలియా మున్సిపాలిటీలోని ఆకాంక్ష హైస్కూల్ విద్యార్థులు ఆర్. జగన్, ఆర్. అనిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15, 16, 17వ తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్, కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆవుల చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే అద్భుత అవకాశాలు


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్: క్రీడల్లో రాణిస్తే అద్భుత అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం ధర్మానాయక్ అన్నారు. అండర్-14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థి ప్రేమ్‌చంద్(9వ తరగతి)ను అభినందించారు. హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఎంపికయ్యాడని తెలిపారు. 17,18వ తేదీల్లో పటాన్‌చెరులో జరగనున్నట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనన్నునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముంతాజ్‌బేగం, ధనలక్ష్మీ, అశ్విని, స్పందన, అనిత, జ్యోతి, ఉపేందర్, కాంతయ్య, జానయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మునుగోడు విద్యార్థిని

మునుగోడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మహాత్మాజ్యోతిబా పులే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పి. వైష్ణవి అనే 8వ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌హెచ్‌జీ క్రీడల్లో భాగంగా కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో ఉత్తమ ఆటతీరుతో ప్రథమ బహుమతి గెలుచుకుందని పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు.

కాల్వకు గండి.. నీట మునిగిన బత్తాయి తోటలు


వరద కాల్వకు గండి పడి తోటలోకి వెళ్తున్న నీరు

హాలియా, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నల్లగొండ జిల్లా అనుముల మండలం ఈశ్వర్‌నగర్ సమీపంలోని వరద కాల్వ కింద ఉన్న డి-8 మైనర్ కాల్వలకు గండి పడింది. దీంతో కాల్వ సమీపంలోని మల్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డితో పాటు పలు రైతులకు చెందిన బత్తాయి తోటలో వరదకాల్వ నీరు వెళ్తుండడంతో బత్తాయి చెట్లు నీటి ఊటపట్టి తోటలు ధ్వంసమవుతున్నాయి. తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుముల శివారులో ఉన్న మల్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డి రైతు బత్తాయి తోట వరకే మైనర్ కాల్వను తీయడంతో అక్కడి నుంచి నీరు కాల్వ బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వరదకాల్వ నీరు అంతా బత్తాయి తోట మీదుగా భారీ వరదగా వెళ్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈశ్వర్‌నగర్ సమీపంలో వరద కాల్వకు పడిన గండిని పూడ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

● దేవరకొండలో సీపీఐ, బీసీ హక్కుల సమితి ఆధ్వర్యంలో ర్యాలీ

దేవరకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో సీపీఐ, బీసీ హక్కుల సమితి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారి 167పై నిరసన తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలోనే ఒక సామాజిక ఉద్యమం ముందుకుసాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో వివక్షత చూపుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు బీసీలపక్షాన సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకట్రాములు, రంగారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట డిపో నుంచి యాత్ర స్పెషల్ బస్


సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి యాత్ర స్పెషల్ లగ్జరీ బస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ జి. లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి మావుర్‌ఘడ్ రేణుక ఎల్లమ్మ జన్మస్థలం, ఏకవీదిక 8వ శక్తిపీఠం, పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగం, ఇగ్నేశ్వర జ్యోతిర్లింగం, ఎల్లోరా, ఎల్లోరా గుహలు, శని సింగనాపూర్ శనేశ్వర ఆలయం, షిరిడి, నాసిక్ కాలరాం మందిర్, పంచవటి, త్రయంబకేష్ జ్యోతిర్లింగం, పండరీపూర్, పాండురంగ దేవాలయం, తుల్జాపూర్ తుల్జాభవాని మూడన్నర శక్తిపీఠం దర్శించుకొని ఈ నెల 28 తేదీ రాత్రి 8గంటలకు సూర్యాపేట డిపోకు చేరుతుందని ఆయన తెలిపారు. ఈ యాత్రకు పెద్దలకు రూ.6500, పిల్లలకు రూ.4500 చార్జీల ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9948303712లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నైబావి బొల్లిగుట్టపై రిజర్వ్ ఫారెస్టు?

● సుప్రీంకోర్టు సూచనలు, సిట్ ఆదేశాలతో సన్నాహాలు ● ఇప్పటికే బొల్లిగుట్టపై శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా స్థలం గుర్తింపు ● వారం రోజుల్లో రెవెన్యూ, అటవీ సిబ్బందితో జాయింట్ సర్వే

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాధ ఎడవల్లి గ్రామపంచాయతీ మధిర గ్రామమైన నైబావి గ్రామ శివారులో ఉన్న 'బొల్లిగుట్ట'పై అటవీ శాఖ ఆధ్వర్యంలో రిజర్వ్ ఫారెస్టు ఏర్పాటుకు యోచిస్తున్నట్లు తెలిసింది. డీమ్డ్ ఫారెస్టు కార్యక్రమం కింద బొల్లిగుట్టపై అటవీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న ఈ బొల్లిగుట్టపై ఇప్పటికే గుర్తించిన భూమిని కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి స్వాధీనపర్చేందుకు రెవెన్యూ, అటవీ సిబ్బంది కలిసి సంయుక్తంగా చేయాల్సిన సర్వేను ఈ వారంలో చేపట్టనున్నట్లు తెలిసింది.

- (ఆంధ్రజ్యోతి -నార్కట్‌పల్లి)



సర్వే అనంతరం కేంద్రానికి స్వాధీనపర్చే స్థల విస్తీర్ణానికి సంబంధించిన ఎన్‌వోసీ(నోఆబ్జెక్షన్)ని రెవెన్యూ అధికారులిచ్చిన తర్వాత అటవీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ స్థలం ఉదంతంపై స్పందించిన సుప్రీంకోర్టు సూచన మేరకే కేంద్ర పర్యావరణ అటవీ అభివృద్ధి శాఖ అటవీ సంపదను పెంచేందుకు సన్నాహాలు చేసింది. పచ్చదనం విస్తరించి నిరుపయోగంగా ఉన్న కొండలు, గుట్టలను గుర్తించి వాటిలో రిజర్వ్ ఫారెస్టును ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణం, జీవారణ్య అభివృద్ధికి కృషి చేయాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం చేసిన సూచనతో ఈ తరహా ప్రదేశాలను శాటిలైట్ కో-ఆర్డినేటర్ల(అక్షాంక్ష, రేఖాంశ్రల) ద్వారా మ్యాపింగ్ చేసి కేంద్రమే వీటిని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. ఇందులో భాగంగానే నల్లగొండ జిల్లాలో పచ్చదనం పరుచుకున్న పలు ప్రదేశాలను గుర్తించి వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. శాటిలైట్ ద్వారా గుర్తించి మ్యాపింగ్ చేసినన ప్రదేశాలు ఏ మండలానికి చెందినవో ఆయా మండలాలకు జిల్లా అధికార యంత్రాంగం చేరవేసింది. గుర్తించిన ప్రదేశాలు ప్రభుత్వ భూములుగా ఉన్నాయి లేక ప్రైవేట్ పట్టా భూములా తేల్చిన తర్వాత ప్రభుత్వ భూములైతే వాటిని కేంద్రానికి ఇచ్చేందుకు సంబంధిత మండల తహసీల్దార్ల ద్వారా ఎన్‌వోసీ తీసుకోనుంది.

19.99 హెక్టార్ల బొల్లిగుట్టపై మ్యాపింగ్

నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎం.ఎడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే నైబావి గ్రామ శివారు 454సర్వే నెంబర్‌లో 189.04 ఎకరాల్లో బొల్లిగుట్ట విస్తరించి ఉంది. ఈ గుట్టపై జాతీయ పక్షి నెమలులు పెద్దసంఖ్యలోనే విహరిస్తుంటాయని రైతులు చెబుతు న్నారు. ఈ బొల్లిగుట్టపై శాటిలైట్ ద్వారా సుమారు 19.99 హెక్టార్ల (సుమారు 49.38ఎకరాలు) పచ్చదనం పర్చుకున్న భూమిని మ్యాపింగ్ చేసి పంపారు. రెవెన్యూ, అటవీ అధికారులు జాయింట్ సర్వే చేయనున్నారు. సర్వే అనంతరం రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇస్తే అటవీశాఖ పరిధిలోకి చేరే ఈ బొల్లిగుట్టపై గుర్తించిన ప్రదేశాన్ని రిజర్వ్ ఫారెస్టుగా అభివృద్ధి చేయనున్నారు.

బౌండరీ, పిల్లర్ల నిర్మాణం

బొల్లిగుట్టపై మ్యాపింగ్ చేసిన ప్రాంతం అటవీ శాఖ పరిధిలోకి రాగానే స్వాధీనమైన స్థలం చుట్టూరా తొలత బౌండరీ పిల్లర్‌లు నిర్మిస్తారు. అనంతరం మొక్కలు నాటడానికి వీలుంటే మొక్కలు నాటి అవెన్యూ, కమ్యూనిటీ ప్లాంటేషన్ కింద మొక్కలను నాటుతారు. గుట్టపై భాగం నుంచి వచ్చే వర్షపు నీటి నిల్వ చేసేందుకు వీలుంటే పర్కు ల్ ట్యాంకులు, చెక్‌డ్యాంలు నిర్మించి నీటి నిల్వ చేస్తారు.



గుట్టలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు


ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహిం చారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.10,45,329 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, స్వామిని శేరీలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులకు ప్రత్యేక చేయగా వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

పాతగుట్ట రోడ్డు విస్తరణ 50 ఫీట్లు


బాధితులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట దేవాలయం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ 50 ఫీట్లకు నిర్ణయం తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక మునిసిపాలిటీ కార్యాలయంలో పాతగుట్ట రోడ్డు విస్తరణ బాధితులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాధితులు రోడ్డు విస్తరణ 40 ఫీట్లకు కుదించాలని, మధ్యలో డివైడర్ ఉండవద్దని, విస్తరణలో నష్టపోయిన వారికి నష్టపరిహారంతో పాటుగా ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వాలని బాధితులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 40ఫీట్లతో రోడ్డు విస్తరణ చేస్తే అందులో అండర్ డ్రైనేజ్, పైపులైన్ వేయడం ఇబ్బందికరంగా ఉంటుందని, 50ఫీట్లు వేస్తే అందులోనే డ్రైనేజ్, పైపులైన్ వేసుకోవచ్చునని అదనపు కలెక్టర్ సూచించారు. మధ్యలో డివైడర్ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్, మేనేజర్ శారద, మాజీ కౌన్సిలర్లు బబ్బూరి మౌనికశ్రీధర్, దండెబోయిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీని వెంటిలేటర్‌పైకి తెచ్చింది బీఆర్ఎస్సే

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎమ్మెల్యే


కొల్లూరులో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ అయిలయ్య

ఆలేరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లాభాల బాటలో ఉన్న మదర్ డెయిరీని పది సంవత్సరాలుగా నష్టాల బాటలోకి తీసుకువచ్చి వెంటిలేటర్‌పైకి తెచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆరోపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొల్లూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మదర్ డెయిరీని రూ.30 నుంచి 40 కోట్ల నష్టాల్లో నెట్టారన్నారు. పాడి రైతులు నిజాలు తెలుసుకోవాలని, దీపావళి నాటికి బిల్లులు చెల్లిస్తారన్నారు. గతంలో దోచుకున్న వారిని చట్టరీత్యా శిక్షిస్తామన్నారు. మదర్ డెయిరీకి పూర్వ వైభవం తెస్తామన్నారు. సమావేశంలో ఆలేరు మార్కెట్ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, నీలం పద్మ, గంధమల్ల అశోక్, ఆరే ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్ చిలుకు కిష్టయ్య, ఎగ్గిడి యాదగిరి, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: పశువులకు గాలికుంటూ వ్యాధి సోకకుండా గాలికుంటూ వ్యాధి నివారణ టీకా వేయించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి జానయ్య, శ్రీకాంత్, డైరెక్టర్లు రాంచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, బాస్కర్ శివరామకృష్ణ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

కనగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని నల్లగొండ డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ఆదేశించారు. ఎస్ లింగోటం, చర్లగౌరారం, గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. తిమ్మన్నగూడెం, చెరువు అన్నారం, చినమాదారం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను ఏపీఎం మహితేశ్వర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎల్లమ్మ ఆళయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఆర్పీఏ మెంబర్ రాజురెడ్డి, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సీసీలు ఇద్దయ్య, విజయలక్ష్మి ఉన్నారు.

బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దగ్గుపాటి విమల అన్నారు. నల్లగొండ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బుధవా రం పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14,17 విభాగాల్లో ఖోఖో బాలికల జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ప్రాథమిక స్థాయి నుంచే బాలికలు ఆసక్తి ఉన్న క్రీడల్లో తర్ఫీదు పొందాలన్నారు. అనంతరం నల్లగొండ, మిర్యాగూడ, దేవరకొండ నియోజకవర్గాల నుంచి బాలికల జట్లు పాల్గొని పోటీ పడ్డాయి. గెలుపొందిన జట్లు ప్రసంశ పత్రాలు అందజేశారు. ప్రతిభ కలిగిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు ఎన్. రాజశేఖర్‌రెడ్డి, వీసంరాజు, జయ, శోభారాణి, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గఫార్, ఇర్ఫాన్, బ్రహ్మయ్య, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 14వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన కోరారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో భాగ్యనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మహాసభల కరపత్రాలు పంపిణీ చేశారు. 2026 జనవరి 25 నుంచి 28 వరకు హైద్రాబాద్‌లో నిర్వహించే మహాసభలకు దేశ నలుమూలల నుంచి వెయ్యి మంది మహిళా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు హలీమా, సైదమ్మ, చాందినీ, విజయలక్ష్మి, కృషి, తునిష తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

● రెండు గేట్ల ద్వారా నీటి విడుదల


రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీరు

నాగార్జునసాగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీం తో ప్రాజెక్టు అధికారులు బుధవారం రెండు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, బుధవారం సాయంత్రం 589.70 అడుగులు (311.1486 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,040 క్యూసెక్కుల నీటిని ఎడమకాల్వ ద్వారా 6,401 క్యూసెక్కుల నీటిని ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,779 క్యూసెకులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లల్లో రెండు గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 16,138 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 67,558 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి అంతే మొత్తంలో నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో..

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు వారం పది రోజులుగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసి వేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చుతున్నారు. గత సోమవారం రాత్రి నుంచి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వాగులు పొంగిపొర్లి మూసీకి వచ్చే ఇన్‌ఫ్లో పెరిగింది. మంగళవారం సాయంత్రానికి 8598.55క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి కొంత మేర తగ్గి 5400.42క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టాన్ని 644.20అడుగులు(4.25టీఎంసీలు)ల వద్ద నిలకడగా ఉంచుతున్న అధికారులు ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 3, 4, 8నెంబరు క్రస్టుగేట్లను 3అడుగుల మేర ఎత్తడం ద్వారా 5258.99క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.20అడుగులు(4.25టీఎంసీలు)గా ఉంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 11 కేవీ లైన్‌షిఫ్టింగ్ పనుల కోసం గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలా చార్యులు తెలిపారు. రాంనగర్ ఫీడర్ పరిధిలోని మిర్యాలగూడ రోడ్డు, బీటీఎస్, షమ్స్ నగర్, భారత్‌గ్యాస్, దారుషఫా కాలనీల విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తను న్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీ సంఘాలకు సంపూర్ణ మద్దతు

చిట్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్ర బంద్‌కు అన్ని వర్గాలు కలిసిరావాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మునుగోడు, చండూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సం పూర్ణ ఆరోగ్యం సాధ్యమని మునుగోడు ప్రాజెక్ట్ సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మునుగోడు, చండూరు హైస్కూల్‌లో బుధవారం పోషణ మాసం సందర్భంగా పౌష్టికాహారం లోపాలు-అనారోగ్యాలు అనే అంశంపై పాఠశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. పోషకాహారం లోపంతోనే సమాజాభివృద్ధి అడ్డంకిగా మారుతుందన్నారు. పోషణ లోపం లేని సమాజం నిర్మించడానికి కృషి చేయాలని కోరారు. పోషక ఆహారంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బాలప్రసాద్, ఏసీడీపీవో దేవ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు నాగమణి, శిరీష, పాఠశాల ఉపాధ్యాయులు, చండూరు కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, హెచ్ఎం కోటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, కేదారీ, జగదీశ్వరీ, ఆస్మాబేగం, విజయనిర్మల, మునిషా బేగం, సునీత పాల్గొన్నారు.



కట్టంగూరు : దుగినివెల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

● మర్రిగూడ : మర్రిగూడ రైతువేదికలో బుధవారం పోషణ మాసం నిర్వహించారు. పోషకాహారం లోపం లేకుండా ఆరోగ్యవంతమైన సమాజం గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతపల్లి సీడీపీవో సక్కుబాయి, సూపర్‌వైజర్ యశోద, శ్రీలత, ఎంపీడీవో మున్నయ్య, ఎంఈవో శ్రీనివాస్, డీటీ నిర్మల, డా.శాలిని, హెల్త్ సూపర్‌వైజర్ అమృత, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, దుగినివెల్లిలో బుధవారం పోషణమాసం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు సూపర్‌వైజర్ పద్మావతి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు మురళయ్య, కరుణాదేవి, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, సలీం వెంకటకృష్ణ, లీలావతి, పీఈటీ సైదులు, టీచర్లు వాణి, జ్యోతి, బిఉప్పలమ్మ పాల్గొన్నారు.


చండూరు పోషణమాసంలో పాల్గొన్న సీడీపీవో లావణ్యకుమారి, టీచర్లు

కుమ్మర సంఘం జిల్లా కన్వీనర్‌గా భిక్షపతి


భిక్షపతి

నార్కట్‌పల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (టీఆర్‌కేఎస్) నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి రాధారపు భిక్షపతి ఎన్నికయ్యారు. కనగల్ మండలం దర్వేశిపురంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా రాధారపు భిక్షపతి, కో-కన్వీనర్‌గా గంగాధరి వెంకటేశ్వర్లుతో పాటు మరో పదిమంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, జిల్లా నాయకులు నిమ్మనగోటి లింగయ్య, ఆమంచి విజయ్‌కుమార్, చిట్టిమల్ల దశరథ, బొడ్డుపల్లి రమేశ్, ఎలిజాల వెంకన్న, నిదానపల్లి వెంకటస్వామి, కంభంపాటి సతీశ్, చంద్రం, అనిత, సత్తయ్య పాల్గొన్నారు.

20న దీపావళి, 21న నోములు

శాలిగౌరారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ఈ నెల 20, 21 తేదీల్లో ఘనంగా నిర్వహించుకోవాలని శాలిగౌరారం మండల పురోహితులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. అక్టోబరు 20న సోమవారం అశ్వీయుజ మాస బహుళ చతుర్దశి ఉదయం 4నుంచి 6 గంటల వరకు సూర్యోదయం లోపల మంగళహారతులు నివాళులు, ధనలక్ష్మి పూజలు, దీపావళి పండుగ నిర్వహించుకోవాలని కోరారు. 21న మంగళవారం అశ్వీయుజ బహుళ అమావాస్య రోజున కేదారేశ్వరస్వామి నోములు చేసుకోవచ్చని తెలిపారు. 22వ తేదీ బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుందని, నవంబరు 5వ తేదీ బుధవారం కార్తీకపౌర్ణమిని ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ పురోహితులు రామడుగు వెంకట్రామశర్మ, వావిలాల వేణునాధశర్మ, వావిలాల రామలింగయ్య శర్మ, కొడవగంటి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, పులి రామకృష్ణ శర్మ, లక్ష్మీప్రసాద్, వెంకటేశ్వరశర్మ, లక్ష్మీనర్సయ్యశర్మ, వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయ వేలం వాయిదా

నార్కట్‌పల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితికిగాను కొబ్బరికాయల విక్రయ వేలం హక్కు కోసం బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. సరైన ధర రాకపోవడంతో బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీవో సుధాకర్ తెలిపారు. కనీస మద్దతు ధర రూ.53,26,000లకు గాను కేవలం రూ.20,10,000లు మాత్రమే పాడటంతో కనీస ధర రానందున వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీవో తెలిపారు. బహిరంగ వేలంలో కేవలం ఇద్దరు టెండరుదారులు మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎల్.వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు చిరుమర్తి వెంకన్న, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

హఫీజుద్దీన్‌కు ఘంటసాల అవార్డు


అవార్డును అందుకుంటున్న హఫీజుద్దీన్

కనగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హఫీజుద్దీన్‌కు బుధవారం ఘంటసాల అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాహిత్య సేవ కమిటీ వారు ఘంటసాల అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాలువాను కప్పి, ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలకామేశ్వర్‌రావు, ప్రభాకరశర్మ, ఆలూరి బిల్‌సన్, అంజలీదేవి, భువన పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

మర్రిగూడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమాజ నిర్మాతలని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలకు చెందిన 24మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, ఇటీవల జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంఅందుకున్న ఏడుగురు ఉపాధ్యాయులను మండల వనరుల కేంద్ర సిబ్బందికి బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, స్పెషల్ ఆఫీసర్ బి.వేణుగోపాల్, ఏపీవో రవికుమార్, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

శాలిగౌరారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేలు సూచించారు. మండలంలోని చిత్తలూరు, తుడిమిడి గ్రామాల్లో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నిర్వహణను అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తేమ ఎక్కువ ఉంటే మిల్లర్లకు నష్టం జరుగుతుందన్నారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని కాంటాలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరిగె నర్సింహా, సింగిల్ విండో ఛైర్మన్ తాళ్లూరి మురళి, తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, మండల వ్యవసాయం అధికారిణి సౌమ్యశృతి, ఐకేపీ ఏపీఎం పోలేపల్లి శంకర్, ఆర్ఐ మహమ్మద్ అజారుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు బండపల్లి కొమరయ్య, షేక్ ఇంతియాజ్ అహ్మద్, బొమ్మగాని రవి, ఎర్ర చైతన్య రాజు తదితరులు పాల్గొన్నారు.


తుడిమిడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల, అక్టోబరు15, (ఆంధ్రజ్యోతి);పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలనీ బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి దిగుబడి ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు దళారుల బారీన పడకుండా మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలనీ కోరారు. కార్యక్రమంలో మైల పరమేష్, వరికుప్పల నర్సింహ, గుంటోజు నాగాచారి పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

నకిరేకల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తి దాయకమని ఆయన స్ఫూర్తితో చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య పిల్లలమర్రి రాములు అన్నారు. నకిరేకల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన స్వర్ణ పతకాల ప్రదానం, ప్రపంచ విద్యార్థుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ ప్రాంతం ప్రతిభావంతులకు ప్రగతిశీల భావజాలానికి పుట్టినిల్లు లాంటిదన్నారు. ఈ కళాశాల విద్యార్థులు నకిరేకల్ జ్ఞానధారను ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర రాజధానిలోని కళాశాలలతో పోటీ పడే విధంగా అధ్యాపకులు బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య, ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీనివాసచారి, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, సరిత, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ టాపర్స్ లోకేష్, మాదవి, భవానిలకు గోల్డ్‌మెడల్స్‌తో పాటు ఒక్కొక్కరికి రూ.4,116 నగదును అందజేశారు.


నకిరేకల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య పిల్లలమర్రి రాములు

● కనగల్ : కనగల్ ఎక్స్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యూ కంబాల శివలీలా ఫౌండేషన్ అధ్యక్షురాలు శివలీలారెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి సాయి, మాదవి, నాగమని, మమత తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ రూరల్ : కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పద్మానగర్ ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం జీవిత విశేషాలు, ఆయన ఆవిష్కరణలు, యువతకు ఆయన ఇచ్చిన స్ఫూర్తిదాయక సందేశాలపై విద్యార్థులు ప్రసంగించారు. కోణం ఫౌండేషన్ 'క్రియ' లో భాగంగా రూపొందించిన యాప్ ద్వారా విద్యార్థులతో మెదడుకు పదును పెట్టే పలు అభ్యసన కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోణం ఫౌండేషన్ ప్రతినిధులు బహుమత ఎలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘుపాల్ రెడ్డి, ఉషా, ఉపాధ్యాయులు సుజాత, సఫియా, కోణం ఫౌండేషన్ ప్రతినిధులు శ్వేత, శ్రీవాణి పాల్గొన్నారు.


నల్లగొండలో డిజిటల్ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

బత్తాయి డీలా

(7వ పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తుండటంతో చెట్లను వాడుకు వదిలే అవకాశం లేకుండా పోయింది. దీంతో కత్తెర కాయ వచ్చే సమయం దాటిందని రైతులు చెబుతున్నా రు. కత్తెర కాయ దిగుబడులు వేసవిలో రానుండటంతో మార్కెట్లో మంచి డి మాండ్ ఉంటుంది. టన్ను కాయకు ధర రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుంది. డిసెంబరు-జనవరిలో పూతకు వచ్చి జూన్ నుంచి ఆగస్టు వరకు కో తకు వచ్చే సీజన్ కాయకు రూ.10 నుంచి రూ.15వేలకు మించి ధర ఉండదు.

తెగుళ్ల బెడద

బత్తాయిలో రెండు ఇంచుల పైపులో వచ్చే నీటితో 10 ఎకరాల వరకు తోటను సాగు చేసుకోవచ్చు. బత్తాయికి అతి తక్కువ నీటి వినియోగం ఉంటుంది. సాధారణంగా వానాకాలంలో బత్తాయికి నీరు పెట్టరు. శీతాకాలంలో 10 రోజులకు ఒక తడి, అదే వేసవిలో మార్చి, ఏప్రిల్, మే నెలలో మాత్రమే 3-5 రోజులకు తడి ఇవ్వాల్సి ఉంటుంది. అంత తక్కువ నీటి వినియోగం బత్తాయిని ఈ ఏడాది కురిసిన వర్షాలు బాగా దెబ్బతీశాయి. చాలా వరకు భూములు జాలు పట్టాయి. జిల్లాలో ఎర్ర నేలలు అనుకూలం కావడంతో అధికంగా బత్తాయి సాగైంది. అధిక వర్షాలు పడినపుడు ఈ నేలలో ఉన్న సూక్ష్మ పోషకాలు కింది పొరల్లోకి వెళ్లి పోవడంతో చెట్టుకు పోషకాలు అందక పల్లబారడంతో పాటు, ఆకులపై మచ్చలతో పాటు గజ్జి తెగులు వ్యాపించి చెట్టు నిద్రావస్థలోకి చేరుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బత్తాయికి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని, వర్షాలు మరో రెండు నెలలు కురిస్తే సీజన్ కాయ దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బత్తాయి సాగు కష్టంగా ఉంది..

నేను పదెకరాల్లో బత్తాయి సాగు చేస్తున్న ఎపుడూ లేనంతగా కురిసిన వర్షాలకు బత్తాయి తోటలకు ఇబ్బందిగా మారింది. సీజన్ కాయ టన్నుకు రూ.15వేలకు మించి ధర లేకపోవడంతో కనీసం పెట్టుబడులు వెళ్లలేదు. ప్రస్తుతం కత్తెర కాయ దిగుబడులు వస్తాయనే ఆశపేడినా, అధిక వర్షాలు ప్రతిబంధకంగా మారాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు నేలలో తేమ అధికం కావడంతో చెట్లు బాగా దెబ్బతిన్నాయి. బాగా పల్లబారిపోయాయి. ఆకులపై గజ్జి మచ్చలు వస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా వాతావరణం సరిగా లేక ఫలితం ఉండటం లేదు. ఈ ఏడాది బత్తాయి కాయ దిగుబడులు వచ్చేది కష్టంగా మారడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- నక్కల లింగారెడ్డి, రైతు, పెద్దగూడెం, అనుముల మండలం

బీసీ రిజర్వేషన్లు కల్పించాలి

మునుగోడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగేంత వరకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం అన్నారు. మునుగోడులో సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18న బీసీ బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఆందోళనతో సుమారు గంట పాటు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముందస్తుగా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. వారికి సర్దిచెప్పి ఆందోళనను విమరమింపజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు బొల్గూరి నర్సింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, ఈ. కైలాసం, ఎం.పాండు, బి.యాదయ్య, సత్తమ్మ, ఉప్పునూతల రమేష్, దుబ్బ వెంకన్న, అంజయ్య, కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి, దశరథ, ఎండీ. జానీమియా, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సదర్ సమ్మేళనం విజయవంతం చేయాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నూక కిరణ్‌కుమార్‌యాదవ్

శాలిగౌరారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలో ఈ నెల చివరి వారంలో నిర్వహించే యాదవుల సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని యాదవ, కురు మ సంఘం ప్రతినిధులు కోరారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. శాలిగౌరారంలో మొదటిసారిగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యాదవుల సమ్మేళనానికి మండలంలోని వివిధ గ్రామాల యాదవులు, కురుమలు హాజరై పలు అంశాలపై అభిప్రాయాల సేకరించి చర్చించారు. ఈ నెల 27 లేదా 28 తేదీల్లో నిర్వహించాలనే అభిప్రాయానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో నూక కిరణ్ కుమార్‌యాదవ్, నోముల జనార్దన్, జమ్ము రమేష్, బొల్లికొండ గణేష్, చింతల శంకర్, మంగదుడ్ల శ్రీనివాస్, గైగుళ్ల అవిలయ్య, తీర్పారి మల్లయ్య, బెల్లి వీరభద్రం, నోముల శ్రీనివాస్, చలకాని మల్లయ్య, నూక జానయ్య, నోముల విజయకుమార్, చీమల అవిలయ్య, లొడంగి మహేష్, వంగూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

18న బీసీల బంద్

నల్లగొండటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీన నిర్వహించ తలపెట్టిన బీసీల బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో బుధవారం బీసీల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌గౌడ్, తండు సైదులుగౌడ్, పైదుల్ల సత్యనారాయణ, పందుల సైదులు, బోనగిరి దేవేందర్, దీపెందర్, యాదగిరి, పంకజ్‌యాదవ్, రవి, శివ, రామన్న, నరేష్, వంశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

పీవోడబ్ల్యూ రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


నకిరేకల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఈ నెల 17, 18వ తేదీల్లో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మి అన్నారు. నకిరేకల్ పట్టణంలో బుధవారం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పీవోడబ్ల్యూ సంస్థ మహిళా సంస్థలపై స్త్రీ, పురుష సమానత్వం కోసం గత 50 సంవత్సరాల నుంచి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. శిక్షణ తరగతుల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది మహిళా ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ ప్రతినిధులు మర్రి సంతోష, పుష్ప, రాణి, ఎల్లమ్మ, ఎస్‌కె. సైదా, వెంకటమ్మ, నాగమణి, స్వరూప, అమ్ములు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

12రోజులు 240 మెట్రిక్ టన్నులు


కనగల్ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

(7వ పేజీ తరువాయి)

అందుకు అనుగుణంగా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. గత సీజన్లలో దొర్లిన పొరపాట్లు ఈ సారి ఎదురవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రణాళికబద్ధంగా ధాన్యం కొనుగోలుకు అధికారులు కార్యాచరణ రూ పొందించారు. ప్రస్తుతానికి 12రోజుల్లో 240మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగడానికి వర్షాలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ వర్షాలు లేకున్నా, మోస్తరు వర్షాల కారణంగా ధాన్యం తడుస్తోంది. ఈ నేపథ్యంలో టార్పాలిన్లు పెద్ద మొత్తంలో సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు కూడా సొంతంగా వీటిని సమకూర్చుకుంటున్నారు. భారీ వర్షాలు వస్తే కొనుగోలు కేంద్రాల్లో సమస్యను అధిగమించేందుకు అధికారులు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4
***
ANDHRAJYOTHY

నల్లగొండ
7
గురువారం 16 అక్టోబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	67,558	67,558
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	5,400.42	5,647.81
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	51,540	37,671

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

12 రోజులు 240 మెట్రిక్‌టన్నులు

- ఇప్పుడిప్పుడే కేంద్రాలకు వస్తున్న ధాన్యం
- మరో వారం రోజుల్లో ఊపందుకునే అవకాశం
- 375 కేంద్రాలకు ఇప్పటికే 157 ప్రారంభం
- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లకు సన్నాహాలు
- వరి కోతలకు ఆటంకంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- పడిపోతున్న తేమ శాతంతో బేజారవుతున్నరైతులు



నల్లగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాక 12 రోజుల్లో 240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. ఈనెల మొదటి వారం నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నాన్‌ఆయకట్టు ప్రాంతంలో వరి కోతలు మొదలైన నేపథ్యంలో అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయకట్టు ప్రాంతంలో కొన్ని చోట్ల బోరుబావుల కింద నాట్లు వేసిన ప్రాంతంలో కూడా కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా నాన్‌ఆయకట్టు ప్రాంతంలోనే వరి కోతలు ప్రారంభమై ధాన్యం వస్తోంది. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వరి కోతలు ప్రారంభించేందుకు వెనుకంజ వేస్తున్నారు. హార్వెస్టర్ల ద్వారా వరి నూర్పిడిచేసి వెనువెంటనే మార్కెట్‌కు తరలిస్తున్నారు. పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో ఐకేపీ కేంద్రాల్లో రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. అయితే తేమశాతం అధికంగా ఉండటంతో సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయని పరిస్థితి ఉంది. జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలకు 157 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మరో 25 కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంతాల్లో ధాన్యం రాకను బట్టి ప్రారంభించనున్నారు.

వచ్చే వారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. రైతులు వీలైనంత మేరకు ధాన్యాన్ని ఆరబెట్టుకొని రావాలని సూచిస్తున్నారు. హార్వెస్టర్ల ద్వారా కోతలు పూర్తిచేసిన వెంటనే పచ్చి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా రైతులు కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో పాటు వర్షాలకు కూడా ధాన్యం తడుస్తోంది. అయితే ఈ ధాన్యాన్ని ఆరబెడితేనే కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు ఎగుమతి చేసేందుకు ప్రధానంగా లారీల సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలకు ధాన్యం బస్తాలు ఎత్తడంతో పాటు మిల్లుల వద్ద అన్‌లోడ్ చేసేందుకు హమాలీల సమస్య లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచతున్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంది. 375 కొనుగోలు కేంద్రాలు మొత్తంగా ప్రారంభమైనప్పుడు అవసరమైన సామగ్రితో పాటు హమాలీలు కూడా అందుబాటులో ఉంటే కొనుగోళ్లలో ఎలాంటి సమస్యరాదని యంత్రాంగం భావిస్తోంది. దీనికి తోడు నిరంతరం కేంద్రాల్లో అధికారులు కొనుగోళ్లను పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.



6.30లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు లక్ష్యం

జిల్లాలో 6,30,981 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. అందులో దొడ్డురకం 4,65,657 మెట్రిక్‌టన్నులు, సన్నరకం 1,65,324 మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయనున్నారు. సన్నరకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 వరకు బోనస్ ఇస్తోంది. అదేవిధంగా నాణ్యత ప్రమాణాల విషయంలో మండల స్థాయిలో ఐకేపీ కేంద్రాలకు సంబంధించి ఏపీవోలను పర్యవేక్షణ కోసం నియమించారు. హార్వెస్టర్ల వివరాలను, రవాణా సౌకర్యాల గురించి ఎప్పటికప్పుడు వీరు వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం 157 కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తున్న ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేసేందుకు 40లారీలను ఏర్పాటు చేశారు. ఈ వానాకాలంలో పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉండటంతో

మిగతా 10వ పేజీలో...

భారీ వర్షాలతో

బత్తాయి డీలా



పూత పిందె లేని బత్తాయి చెట్లు



- చెట్లు వాడుపడక.. కత్తెర కాపు లేక.. తెగుళ్లతో దెబ్బతింటున్న తోటలు
- ఈ ఏడాది అంతా నిరాశే
- ఆందోళనలో రైతులు

మిర్యాలగూడ వ్యవసాయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకు కల్పతరవుగా ఉన్న బత్తాయిని వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు బత్తాయి కాయకు ధర లేక భారీగా నష్టపోయిన రైతులు ఈ సారైనా కాలం కలిసొస్తుందని ఆశపడ్డా ఎడతెరిపిలేని వర్షాలు నిరాశను మిగిల్చాయి. తెగుళ్లవ్యాప్తి, కత్తెర కాపు అనుకూల వాతావరణం లేక రైతులు దిగాలు చెందుతున్నారు.

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతోందని అంచనా. ఈ ఏడాది అధిక వర్షాలకుతోడు భూగర్భ జలాలు పెరగడంతో చాలా తోటలు జాలు పట్టాయి. సాధారణంగా భూమిలో అధిక తేమ ఉంటే బత్తాయి చెట్లు దెబ్బతింటాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు నేల తడి ఆరకపోవడంతో బత్తాయికి ముప్పు ఏర్పడింది.

కత్తెర కాయ లేదు

బత్తాయిలో ప్రధాన ఆదాయ వనరు కత్తెర కాయ ఏప్రిల్, మే నెలలో కోతకు వస్తుంది. ఈ కాయ రావాలంటే ఆగస్టు వరకు సీజన్ కాయ కోతలు పూర్తిచేసి ఎండు కొమ్మలు కత్తిరించుకున్న తరువాత సెప్టెంబరు-అక్టోబరు నెలలో చెట్టును వాడుకు (బహర్ పద్ధతి) వదలిపెట్టాలి. చెట్టు వాడిపోయిన దశలో పిండి వేసుకుని నీరు కట్టడంతో ఒక్క సారిగా పూత వస్తుంది. పిందె వచ్చాక వేసవిలో కాయ కోతకు వస్తుంది. ఈ సారి నేటికీ

మిగతా 10వ పేజీలో...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ



'ఓట్ చోరీ'పై సంతకాల సేకరణ పత్రాలను చూపుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో బీజేపీ దొంగ ఓట్లతో గద్దెనెక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగానికి వచ్చిన ఆపదను కాపాడేందుకు రాహుల్‌గాంధీ నాయకత్వంలో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రతీ పోలింగ్ బూత్‌లో సంతకాల సేకరణకు పార్టీ ఆదేశించిందన్నారు. ఓట్ చోరీ పట్టణాల్లో ఎక్కువ ఉంటోందని, అందుకే ఉత్తరాది రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ ఒత్తిడికిగురై ఎలక్షన్ కమిషన్ కూడా పట్టించుకోకుండా ఈ చోరీలో భాగస్వామ్యమైందన్నారు. నిజాయితీగా ఏ ప్రభుత్వం పనిచేస్తుందో ఆ ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ తనవశం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. బీహార్‌లో 70 లక్షల ఓట్ చోరీ చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, నూక కిరణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నర్సింహ, తాళ్లూరి మురళీ, చింత ధనుంజయ్, షేక్ ఇంతియాజ్, బొల్లికొండ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుబడిలో రాష్ట్రం రికార్డ్





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తదితరులు

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం దిగుబడిలో రాష్ట్రం ఆల్‌టైం రికార్డ్ సాధించిందని, వానాకాలం 148.3లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వానాకాలంలో పెద్ద మొత్తంలో ధాన్యం వస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాలని, రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిరీక్షించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని, ఈ విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, రెండేళ్లుగా ధాన్యం సేకరణను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో సైతం సేకరణను అలాగే పూర్తిచేయాలని ఆదేశించారు. ధాన్యంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా పంటల సేకరణ పై కూడా దృష్టి సారించాలన్నారు.

అన్ని వసతులు కల్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాలకు అవసరమైన సామగ్రిని పంపామని, మరో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ధాన్యం రవాణాకు లారీల సమస్య, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమను కొలిచే, తూకం వేసే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను మండల స్థాయిలో ఏపీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. హార్వెస్టర్ల వివరాలను సైతం సేకరించాలని ట్రాన్స్‌పోర్ట్, పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపేందుకు తొలి విడత 40 లారీలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్‌వో వెంకటేశం, డీఎం గోపికృష్ణ, వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రవాణాశాఖ నిబంధనలు పాటించాలి

డీటీవో లావణ్య



స్కూల్ బస్సులను తనిఖీచేస్తున్న డీటీవో లావణ్య, ఎంవీఐలు

మిర్యాలగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహన యజమానులు రవాణాశాఖ నిబంధనలను తప్పక పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి లావణ్య అన్నారు. బుధవారం పట్టణంలోని పలు స్కూల్ బస్సులను ఎంవీఐ చంద్రశేఖర్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. తనిఖీల్లో స్కూల్ బస్సుల్లో అటెండర్లు లేకపోవడం, ఓవర్‌లోడ్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు లేని తొమ్మిది బస్సులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ బస్సుకు ప్రాక్సీమిటీ మిర్రర్ ఏర్పాటు చేయాలని అన్నారు. అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలని ఆదేశించారు. వాహన తనిఖీల్లో ఎంవీఐలు సోనిప్రియ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు చట్టం చేయాలి

నల్లగొండ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటులో చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం స్థానిక సుభాష్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసేందుకు కృషి చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేరుతో పార్లమెంట్‌లో చట్టం చేయకుండా బీసీల జీవితాలను నాశనం చేసే చర్యలకు పాల్పడతోందన్నారు. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదనే నిబంధన, కోర్టుల పేరుతో బీసీల ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తున్నారని అన్నారు. రాజకీయాలకతీతంగా సామాజిక న్యాయం కోసం సాగుతున్న పోరులో అంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. గీత పనివాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ, ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కేస్.రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, బరిగల వెంకటేష్, సుజాత, విజయ, మాధవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బిశ్వంత్ రాజా మహతి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్

ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పాలనవైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులను పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎంతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి సిరాజ్‌ఖాన్, మార్కెట్‌కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, లోకసాని శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, రాంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మెపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రుక్మారెడ్డి, బిక్కునాయక్, పాల్గొన్నారు.

నేడు ఏఐసీసీ పరిశీలకుల రాక

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా ఏఐసీసీ పరిశీలకులు మిర్యాలగూడకు రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం 9గంటలకు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎంసీపీఐ నాయకులు

ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య

మిర్యాలగూడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సామాజిక విక్ష, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని ఎంసీపీఐ కేంద్రకమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాస్తారోకో నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజురోజుకూ ఫాసిస్ట్ విధానాలను అమలు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సుప్రీం కోర్టు సిజే గవాయ్‌పై చెప్పుతో దాడి, హర్యాణాలో దళిత ఐపీఎస్ అధికారిపై సామాజిక వివక్ష కొనసాగించడం వల్ల ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఒడిశాలో దళిత మహిళ సజీవ దహనం, విలేజ్ అభివృద్ధి కమిటీ పేరుతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సామాజిక బహిష్కరణలు, దాడులు, పరువు హత్యల పరంపర సాగుతోందని అన్నారు. ఈ సంస్కృతి ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెంచి పోషిస్తోందని అన్నారు. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా అణగారినవర్గాలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశీ, కిరణ్, భరత్, జ్యోతి, కమలమ్మ, లాలు, మచ్చ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కేతేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో ధాన్యం తడిసిన రైలకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో తడిసిన వానికిలం ధాన్య రాసులను ప్రమీల పలువురు రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన రైతుల ధాన్యాన్నంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఆరబోసిన ధాన్యం వరదలకు కొట్టుకుపోయి, నష్టాలబారిన పడిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, కోట లింగయ్య, చెరుకు సత్తయ్య, సీహెచ్.నాగయ్య, కె.శోభన్, వి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడాలి



దేవరకొండ ఉన్నతపాఠశాలలో మాట్లాడుతున్న జీటీఏ జిల్లా అధ్యక్షుడు స్వామి

నల్లగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కులు, పదోన్నతుల కోసం పోరాడాలని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) జిల్లా అధ్యక్షుడు దూడిగామ స్వామి అన్నారు. బుధవారం మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరాడుతున్న జీటీఏను ఆదరించాలని అన్నారు. అందుకు విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టినట్టు తెలిపారు. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా సభ్యత్వ నమోదు చేస్తుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమాల్లో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంపత్‌కుమార్, ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మానాయక్, ప్రధానోపాధ్యాయుడు శేషు, యేషబోయిన బద్రీనాథ్‌యాదవ్, పత్తేపురం సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి మైనార్టీలకు ఇవ్వాలి

దేవరకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి మైనార్టీలకు కేటాయించాలని దేవరకొండ నియోజకవర్గానికి చెందిన మైనార్టీ నాయకుడు, కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.ఎ.సిరాజ్‌ఖాన్ ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజామహతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నానని, తనకు మైనార్టీ కోటలో జిల్లా అధ్యక్ష పదవి కేటాయించాలని విన్నవించినట్లు ఆయన కోరారు.

బీసీభవన్‌లో వసతులు కల్పించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించిన జ్యోతిరావు పూలే (బీసీ)భవన్‌లో వసతులు కల్పించాలని కోరుతూ బీసీ సంఘాల నాయకులు కోరారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని హంగులతో నిర్మించిన భవనానికి నీటివసతి లేకపోవడంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోల సైదులు, శ్యాం, జయరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, మాడ్గులపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్య సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలో పోషణమాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులతో కలిసి పలకపై అక్షరాలు తీర్చిదిద్దించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని అన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్లు లక్ష్మి, నాయకులు కొర్ర రాంసింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



దేవరకొండలో జెల్ల సాక్షిణకు అక్షరాభ్యాసం చేయిస్తున్న బాలునాయక్

మాడ్గులపల్లి: కిశోర బాలికలు ప్రతినిత్యం పోషకాహారం తీసుకుంటే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని సీడీపీవో చంద్రకళ అన్నారు. మాడ్గులపల్లి మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ప్రతిరోజు తాము తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా మిల్లెట్స్ చిరుధాన్యాలు, తోటకూర, క్యారెట్లు, బీట్‌రూట్, పల్లీలు, బెల్లం, నువ్వులు, ఖర్జూర, గుడ్లు, మాంసాహారం, చేపలు వంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెకంటమ్మ, తహసీల్దార్ సరోజనిపావని, డీటీ సైదులు, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్లు లక్ష్మి, పరిమి రజిని, నాగమణి, రమణి, అశ్రిత, ఎన్‌జీవో సభ్యురాలు కవిత, హెల్త్ సూపర్‌వైజర్ సుభద్రిన, ఏఎన్ఎం పాల్గొన్నారు.



మాడ్గులపల్లిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో చంద్రకళ

అడవిదేవులపల్లి: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని అడవిదేవులపల్లి పీహెచ్‌సీ వైద్యుడు అజహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. సమావేశంలో కేజీబీవీ ఎస్‌వో నాగలక్ష్మి, ఏఎన్ఎం ముత్యాలమ్మ, కవిత, అంగన్‌వాడీ టీచర్లు శోభ, రమాదేవి, మణెమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

గుర్రంపోడు: మండలంలోని పోచంపల్లిలో హైస్కూల్‌లో విద్యార్థులకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని గుమ్మడవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, డబ్ల్యూటీ అరుంధతి, ఏడబ్ల్యూహెచ్ సుమతి, హెచ్ఎం రేణుక, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బత్తాయి డీలా

(7వ పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తుండటంతో చెట్లను వాడుకు వదిలే అవకాశం లేకుండా పోయింది. దీంతో కత్తెర కాయ వచ్చే సమయం దాటిందని రైతులు చెబుతున్నారు. కత్తెర కాయ దిగుబడులు వేసవిలో రానుండటంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. టన్ను కాయకు ధర రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుంది. డిసెంబరు-జనవరిలో పూతకు వచ్చి జూన్ నుంచి ఆగస్టు వరకు కోతకు వచ్చే సీజన్ కాయకు రూ.10 నుంచి రూ.15వేలకు మించి ధర ఉండదు.

తెగుళ్ల బెడద

బత్తాయిలో రెండు ఇంచుల పైపులో వచ్చే నీటితో 10 ఎకరాల వరకు తోటను సాగు చేసుకోవచ్చు. బత్తాయికి అతి తక్కువ నీటి వినియోగం ఉంటుంది. సాధారణంగా వానాకాలంలో బత్తాయికి నీరు పెట్టరు. శీతాకాలంలో 10 రోజులకు ఒక తడి, అదే వేసవిలో మార్చి, ఏప్రిల్, మే నెలలో మాత్రమే 3-5 రోజులకు తడి ఇవ్వాల్సి ఉంటుంది. అంత తక్కువ నీటి వినియోగం బత్తాయిని ఈ ఏడాది కురిసిన వర్షాలు బాగా దెబ్బతీశాయి. చాలా వరకు భూములు జాలు పట్టాయి. జిల్లాలో ఎర్ర నేలలు అనుకూలం కావడంతో అధికంగా బత్తాయి సాగైంది. అధిక వర్షాలు పడినపుడు ఈ నేలలో ఉన్న సూక్ష్మ పోషకాలు కింది పొరల్లోకి వెళ్లి పోవడంతో చెట్టుకు పోషకాలు అందక పల్లబారడంతో పాటు, ఆకులపై మచ్చలతో పాటు గజ్జి తెగులు వ్యాపించి చెట్టు నిద్రావస్థలోకి చేరుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బత్తాయికి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని, వర్షాలు మరో రెండు నెలలు కురిస్తే సీజన్ కాయ దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బత్తాయి సాగు కష్టంగా ఉంది..

నేను పదెకరాల్లో బత్తాయి సాగు చేస్తున్న ఎపుడూ లేనంతగా కురిసిన వర్షాలకు బత్తాయి తోటలకు ఇబ్బందిగా మారింది. సీజన్ కాయ టన్నుకు రూ.15వేలకు మించి ధర లేకపోవడంతో కనీసం పెట్టుబడులు వెళ్లలేదు. ప్రస్తుతం కత్తెర కాయ దిగుబడులు వస్తాయనే ఆశపేడినా, అధిక వర్షాలు ప్రతిబంధకంగా మారాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు నేలలో తేమ అధికం కావడంతో చెట్లు బాగా దెబ్బతిన్నాయి. బాగా పల్లబారిపోయాయి. ఆకులపై గజ్జి మచ్చలు వస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా వాతావరణం సరిగా లేక ఫలితం ఉండటం లేదు. ఈ ఏడాది బత్తాయి కాయ దిగుబడులు వచ్చేది కష్టంగా మారడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- నక్కల లింగారెడ్డి, రైతు, పెద్దగూడెం, అనుముల మండలం

22 నుంచి సోమేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఈ నెల 22 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు నిత్యం రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వెల్లటూరి రామ్మోహన్ బుధవారం తెలిపారు. రుద్రాభిషేకం పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని అన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు అన్నారు. పట్టణంలోని టీకేవీ రంగాచార్యులు, రంగనాయకమ్మ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో నేత్ర చికిత్సలతో పాటు బీపీ, షుగర్ తదితర వైద్యసేవలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ ప్రనూష, క్రాంతికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

త్రిపురారం: మండలకేంద్రానికి చెందిన బొల్లోజు నవీన్‌చారి బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న త్రిపురారం బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు అబిమాళ్ల వెంకటేశ్వర్లు(పండు) మృతుడి ఇంటికి వెళ్ళి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి చెరో రూ. 5వేలు అందజేశారు. అనంతరం బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి వంద మందికి భోజనాలు అందజేశారు.

ఒంటరి స్త్రీలు, మహిళా కూలీలకు పింఛన్ ఇవ్వాలి

దేవరకొండ: ఒంటరి మహిళలకు పింఛన్ ఇవ్వాలని, వ్యవసాయం చేస్తున్న మహిళ రైతుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ జమున డిమాండ్ చేశారు. దేవరకొండలో గ్రామ్య సంస్థతో పాటు మహిళ రైతు హక్కుల వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో రమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ రైతు వేదిక గ్రామ్య సంస్థ నిర్వాహకులు లక్ష్మి, భార్గవి, పావని, ఆంజనేయులు పాల్గొన్నారు.

12రోజులు 240 మెట్రిక్ టన్నులు



కనగల్ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

(7వ పేజీ తరువాయి)

అందుకు అనుగుణంగా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. గత సీజన్లలో దొర్లిన పొరపాట్లు ఈ సారి ఎదురవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రణాళికబద్ధంగా ధాన్యం కొనుగోలుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతానికి 12రోజుల్లో 240మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేశాయి. ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగడానికి వర్షాలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ వర్షాలు లేకున్నా, మోస్తరు వర్షాల కారణంగా ధాన్యం తడుస్తోంది. ఈ నేపథ్యంలో టార్పాలిన్లు పెద్ద మొత్తంలో సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు కూడా సొంతంగా వీటిని సమకూర్చుకుంటున్నారు. భారీ వర్షాలు వస్తే కొనుగోలు కేంద్రాల్లో సమస్యను అధిగమించేందుకు అధికారులు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని హాలియా డివిజన్ ఏడీఏ సరిత అన్నారు. మండలంలోని నెల్లికల్లు రైతువేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు పంపిణీ చేసిన వేరుశనగ విత్తనాల సాగులో మెళకువలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార నూనెలకు సంబంధించిన పంటలను ప్రోత్సహించేందుకు పలు పథకాలను అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో గంటా హర్షిత, ఏఈవో సుస్మిత, ఎఫ్‌పీవో ఛైర్మన్ బాలకృష్ణ, వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న ఏడీఏ సరిత, ఏవో హర్షిత

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

చింతపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీ ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సీపీఆర్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మట్లాడారు. ఈ మేరకు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్త చర్యల కోసం అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్‌లో చేరికలు

దామరచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బుధవారం టీఆర్‌వీకేఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకేఎస్‌లో చేరిన ఎఫ్ఎం జీఆర్-1గా పనిచేస్తున్న దార ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రూపావత్ సూర్యలకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగండ్ల రమేష్‌తోపాటు మరికొందరికీ సభ్యత్వం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రసాద్, సూర్య మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమవంతుగా కృషి చేస్తామని, కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ తిప్పారపు రమేష్, బొడెడ్ల శ్రీనివాస్, మల్లెల వీరనారాయణ, నాదెళ్ల రవికుమార్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, అజ్మీరా చంద్రశేఖర్, రాంబాబు, బండి చిన్న వెంకయ్య, విష్ణువర్ధన్, బిక్కోజినాయక్, రంజిత్‌కుమార్, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న చారుగండ్ల రమేష్